నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
3 | మహబూబ్‌నగర్, బుధవారం 9 అక్టోబర్ 2024 | NAGARKURNOOL

కాత్యాయనీదేవీగా దర్శనమిస్తున్న అలంపూర్‌లోని జోగుళాంబ, శ్రీశైలంలోని భ్రామరి అమ్మవారు

కాత్యాయనీ.. శుభప్రదాయనీ

అలంపూర్/శ్రీశైలం/పెబ్బేరు, అక్టోబర్ 8 : దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా అలంపూర్ జోగుళాంబ, శ్రీశైల భ్రామరీ మంగళవారం కాత్యాయనీ దేవీగా భక్తులకు దర్శన మిచ్చారు. ఆయా ఆల యాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ దేవి నాలుగు చేతుల్లో వరముద్ర, పద్మం, అభయముద్రలు, ఖడ్గాన్ని ధరించి సకల శుభప్ర దాయనీగా భక్తులను కటా క్షించారు. కాత్యాయనీ అమ్మవారిని దర్శించుకుంటే జన్మజన్మ పాపాలన్నీ హరింప జేస తాయని పండితులు చెబుతున్నారు. శ్రీశైలం క్షేత్రంలో గ్రామోత్సవాన్ని కనులపం డువుగా నిర్వహించారు. అక్కమ హదేవి అలంకారమండపంలో భ్రామరీ సమేత మల్లికార్జున స్వామివార్లను హంసవా హనంపై అధిష్టింపజేసి అర్చక వేదపం డితులు విశేష పూజలు చేసినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. ఉత్సవ అనంతరం కాళరాత్రిపూజ మంత్రపుష్పం తోపాటు అమ్మవారికి ఆస్థానసేవ నిర్వహిం చారు. పెబ్బేరు పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారు లక్ష్మీదేవిగా దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రూ.1,11,11,111 అలంకరిం చారు. పూజారి

పెబ్బేరు : రూ.1,11,11,111తో అమ్మవారి అలంకరణ

కిట్టుస్వామి అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మెప్మాలో గోల్‌మాల్

మెప్మా కార్యాలయంలో మహిళా సంఘాల వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

- మహిళా సంఘాల సభ్యులకు తెలియకుండా డబ్బులు ట్రాన్స్‌ఫర్
- రూ.కోటికిపైగా బ్యాంక్ లింకేజీ రుణాలు పక్కదారి?
- చనిపోయిన మహిళకు రుణం మంజూరు
- మున్సిపల్, మెప్మా, బ్యాంక్ అధికారుల తీరుపై అనుమానాలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, అక్టోబర్ 8 : మహబూబ్‌నగర్ పట్టణంలోని కోయనగర్ పరిధిలో ఉన్న కృషి మహిళా సంఘానికి ఈ నెల 4వ తేదీన రూ.20 లక్షల రుణాన్ని రీసోర్స్ పర్సన్ (ఆర్పీ) ఇప్పించారు. ఆ తర్వాత కృషి మహిళా సంఘంలోని రూ.10 లక్షలను శ్రీ మంజునాథ సంఘానికి రూ.6 లక్షలు, శివసాయి సంఘానికి రూ.4లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. డబ్బుల లావాదేవీలకు సంబంధించి సంఘం సభ్యులకు ఎస్ఎంఎస్ రావడంతో బ్యాంక్ అధికారులను సంప్రదించారు. తమ సంఘం నుంచి అనుమతి లేకుండా ఇతరులకు రూ.10 లక్షలు ఎలా ట్రాన్స్‌ఫర్ చేశారని ప్రశ్నించారు. దీంతో బ్యాంక్ అధికారులు ఆ డబ్బులను తిరిగి ఖాతాలో జమచేశారు. ఇందుకు కారణమైన ఆర్పీని పిలిచి సర్దిచెప్పారు.

తీగ లాగుతారా? కప్పి పెడుతారా?

కోయనగర్ ఎస్ఎల్ఎఫ్ పరిధిలో 33 స్వయం సహాయక సంఘాలు ఉండగా.. సుమారు రూ.కోటికిపైగా బ్యాంక్ లింకేజీ రుణాలు గోల్‌మాల్ జరిగినట్లు సభ్యులు వాపోతున్నారు. ప్రతి సంఘం పేరిట రూ.10 లక్షల వరకు లోన్ తీసుకున్నట్లు ఉందంటున్నారు. ఈ విషయంపై మున్సిపల్, మెప్మా, బ్యాంక్ అధికారులు తీగ లాగితే డొంక కదిలే అవకాశాలు ఉన్నా.. అటువైపు దృష్టి సారించడం లేదని ఆరోపిస్తున్నారు. బ్యాంక్ రుణాలు తమ పేరిట తీసుకుని అక్రమంగా వాడుకుంటున్నా.. అధికారులు గుర్తించకపోవడం, ఆ భారం తమపై పడుతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోయ నగర్‌లోని మొత్తం సంఘాల్లో బ్యాంకు, పొదుపు, స్త్రీనిధి ద్వారా ఎన్ని అక్రమాలు జరిగాయనేది లేల్చాల్సి ఉన్నది.

పర్యవేక్షణ లోపమే కారణమా?

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 49 వార్డులు ఉండగా.. 2,826 స్వయం సహాయక సంఘాల్లో 28,036 సభ్యులు ఉన్నారు. వీరిపై పర్యవేక్షణ, బ్యాంక్ లింకేజీ రుణాలు, ఇతర కార్యక్రమాల అమలుకు మెప్మా కార్యాలయం నుంచి మానిటరింగ్ అధికారులుగా కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీవో)లు ఉంటారు. ప్రతి నెలా సంఘాల సమావేశాలకు హాజరుకావడంతోపాటు సభ్యులు తీసుకుంటున్న రుణాలు, చెల్లిస్తున్న కిస్తులు, మహిళాభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు చేయాల్సి ఉంటుంది. అయితే, గోల్‌మాల్ ఇంత పెద్ద స్థాయిలో జరుగుతున్నా.. వారు కిమ్మనకుండా ఉండడానికి కారణమేంటి..? బ్యాంక్ అధికారులు ఓ చిన్న అక్షరం పొరపాటు పడితేనే సవాలక్ష కారణాలు చెబుతూ బ్యాంకుల చుట్టూ తిప్పించుకుంటుంటారు..! మరి ఓ మహిళ చెబితే ఇన్ని సంఘాలకు ఇంత మొత్తం ఎలా రుణాలు మంజూరు చేశారు..? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

తప్పని తేలితే చర్యలు తీసుకుంటాం..

లీడ్ బ్యాంక్ మేనేజర్ కల్వ భాస్కర్‌ను వివరణ కోరగా.. బ్యాంక్ లింకేజీ రుణాలకు సంబంధించి స్వయం సహాయక సంఘాల సభ్యులతో కచ్చితంగా ఒకటికి రెండు పర్యాయాలు మాట్లాడి.. సంఘం తీర్మానంతోనే రుణాలు ఇవ్వాలని తెలిపామన్నారు. చనిపోయిన మహిళ పేరిట రుణమెలా ఇచ్చారని అడగగా.. 'డాక్యుమెంటేషన్ అయ్యాక ఆమె చనిపోయి ఉండొచ్చు.. ఈ విషయాలపై సమగ్ర వివరాలు సేకరిస్తాం. అక్రమాలు జరిగినట్లు తేలితే చర్యలు చేపడతాం' అని పేర్కొన్నారు. కోయనగర్ సీవోకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

కళావతి (ఫైల్)

ఈమె పేరు వడ్ల కళావతి. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని కోయనగర్‌కు చెందిన ఆమె సాయి మణికంఠ మహిళా సంఘం లో సభ్యురాలు. అయితే, అనారోగ్యం బారిన పడగా.. హైదరాబాద్ ఈఎస్ఐ దవాఖానలో చికిత్స పొందుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 25వ తేదీన మృతి చెందింది. ఇదిలా ఉండగా, ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీన (ఆమె చనిపోయిన రెండు నెలల తర్వాత) మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఎదుట ఉన్న స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (అగ్రికల్చర్ కమర్షియల్ బ్రాంచ్)లో రుణం తీసుకు న్నట్లు లావాదేవీల్లో నమోదైంది.

మాధవి మహిళా, ఇతర సంఘాల సభ్యులు

మెప్మా కార్యాలయం ఎదుట ఉన్న ఈ మహిళలు తిమ్మసానిపల్లికి చెందిన మాధవి మహిళా సంఘంలో సభ్యులు. వారికి తెలియకుండా సంఘం పేరిట ఈ ఏడాది ఏప్రిల్ 26వ తేదీన మహబూబ్‌నగర్ క్లాక్‌టవర్ ఎస్‌బీఐలో రూ.10లక్షల రుణం మంజూరు కావడంతోపాటు సంఘం ఖాతా నుంచి ఇతరులకు బదిలీ చేశారు. ఇవి మచ్చుకు మాత్రమే.. మహబూబ్‌నగర్ మున్సి పాలిటీ, మెప్మా అధికారుల పర్యవేక్షణ లోపం.. బ్యాంక్ అధికారుల అత్యుత్సాహంతో అక్రమార్కులు రూ.కోటికి పైగా బ్యాంక్ లింకేజీ రుణాలను గోల్‌మాల్ చేసినట్లు తెలుస్తున్నది.

- కాంగ్రెస్ పాలనలో విజయడెయిరీకి మళ్లీ కష్టాలు
- బిల్లులు చెల్లించక పోవడంతో పాడి రైతుల ఆందోళన
- పది రోజులకు ఇవ్వాల్సింది.. 70 రోజులైనా దిక్కులేదు..
- గద్వాలలో రూ.30 లక్షల బిల్లులు పెండింగ్
- రైతుల సహకారంతో బలోపేతం చేసిన కేసీఆర్ సర్కారు
- నాడు లాభాల బాటలో.. నేడు నష్టాల ఊబిలో అన్నదాత

గద్వాలలోని పాల ఉత్పత్తి కేంద్రం

పాడి రైతుల ఆవేదన పాలు

పాల ఉత్పత్తి కేంద్రంలో పాలు పోస్తున్న రైతులు

గద్వాల, అక్టోబర్ 8 : కేసీఆర్ సర్కారు పాలనలో విజయ డెయిరీ లాభాల బాటలో నడిచింది. రైతులకు వ్యవసాయంతోపాటు అదనపు ఆదాయం సమకూర్చడంలో భాగంగా వారి సహకారంతో విజయ డెయిరీని బలోపేతం చేసింది. రైతులను నిలువునా దోచుకునే ప్రైవేట్ డెయిరీలకు అడ్డుకట్ట వేసేందుకు పాల ధరలను పెంచి చేయూతనందించింది. గత ప్రభుత్వంలో విజయ డెయిరీ లాభాల బాటలో పయనించగా.. నేడు కాంగ్రెస్ పది నెలల పాలనలోనే నష్టాల ఊబిలోకి నెట్టింది. ప్రస్తుతం విజయడెయిరీకి పాలు పోసే పాడి రైతులకు బిల్లులు చెల్లించకపోవడంతో ప్రైవేట్ డెయిరీల వైపు మొగ్గు చూపుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో సాగునీరు పుష్కలంగా ఉండడంతో అన్నదాతలు సాగుతోపాటు ప్రతి ఇంటికీ ఆవులు, పాడిగేదెలను పెంచుకుంటూ అదనపు ఆదాయం సమకూర్చుకుంటున్నారు. భూములన్నీ సాగులోకి రావడంతో పశువుల మేతకు కూడా కొదవ లేదు. అయితే, ప్రస్తుతం రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాక, రైతు భరోసా అందక, పాల డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారు. పాడిగేదెల ద్వారా వచ్చే ఆదాయంతోనైనా కుటుంబాన్ని పోషించుకుందామంటే పాలబిల్లులను కూడా చెల్లించక పోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

నాడు 4 వేలు.. నేడు 1,100 లీటర్లు..

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఉన్న విజయ డెయిరీకి సుమారు 1,500 మంది రైతులు పాలు పోస్తున్నారు. అయితే, కేసీఆర్ ప్రభుత్వంలో ప్రారంభించిన ఈ డెయిరీకి నిత్యం సుమారు 3,500 నుంచి 4 వేల లీటర్ల వరకు పాలు పోసేవారు. దీని తోడు పాడి రైతులను ప్రోత్సహించాలనే ఆలోచనతో కేసీఆర్ సర్కారు పాల ధర పెంచి వారికి చేయూతనందించింది. దీనిని కొనసాగించాల్సిన రేవంత్ సర్కారు పూర్తిగా విస్మరించింది. పాడి రైతుల బిల్లులు చెల్లించడంలో గత డిసెంబర్ నుంచి జాప్యం చేస్తూ వస్తున్నది. పదిరోజులకోసారి బిల్లులు చెల్లించాల్సి ఉండగా.. 70 రోజులకు చెందిన ఏడు బిల్లులను పెండింగ్‌లో ఉంచింది. ఈ క్రమంలో జిల్లాలో రైతులకు సుమారు రూ.30 లక్షలకు పైగా చెల్లించాల్సి ఉన్నది.

బిల్లుల చెల్లింపుల్లో జాప్యం..

పాడి రైతుల బిల్లుల చెల్లింపులో ఆలస్యం చేస్తుండడంతో రైతులు పాడి పశువుల దాణా, గడ్డి, కూలీలకు డబ్బులిచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పాడిరైతులు కేవలం బిల్లులపై ఆధారపడి ఉండడంతో ప్రస్తుతం తమ పిల్లల స్కూలు ఫీజులు చెల్లించలేక సతమతమవుతున్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలంటూ ఇటీవల పాడి రైతులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి.., కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకుంటే విజయ డెయిరీకి పాలు బంద్ చేసి.. ప్రైవేట్ వైపు వెళ్లే ఆలోచనలో ఉన్నామన్నారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే నిరాహార దీక్షలకు సిద్ధంగా ఉన్నామని పాడి రైతులు హెచ్చరిస్తున్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ఎదుట పాడి రైతుల నిరసన (ఫైల్)

ఇబ్బందులు పడుతున్నాం..

పది రోజులకు రూ.35 వేల వరకు బిల్లు వచ్చేది. ప్రస్తుతం ఆరు విడుతల్లో కలిపి రూ.2 లక్షలు రావాల్సి ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం గత 70 రోజులుగా బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పశువులకు మేత, దాణా కొనుగోలు చేయలేక పోతున్నాం. కుటుంబపోషణ కష్టతరమైంది. పిల్లల ఫీజులు కట్టలేక పోతున్నాం. పాల అమ్మకం మీదే మేము ఆధారపడి ఉన్నాం. రేవంత్ రెడ్డి సర్కారు పాడి రైతులను పూర్తిగా విస్మరించింది. రుణమాఫీ, రైతుభరోసా కూడా ఇవ్వలేదు

– మన్నెం, పాడి రైతు, గద్వాల

రామరామరామ ఉయ్యాలో..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. మంగళవారం పట్టణాలు, గ్రామాలు, ఊరూవాడా మహిళలు బతుకమ్మలను ఎత్తి ఒక్కచోట పేర్చారు. వాటి చుట్టూ బొడ్డెమ్మలు, కోలాటాలు ఆడారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయేందిరబోయి ఉద్యోగులతో కలిసి వేడుకల్లో పాలుపంచుకున్నారు. వనపర్తి అర్టీసీ బస్టాండ్ ఆవరణలో మహిళా కార్మికులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, అక్టోబర్ 8

పోస్టల్ అధికారుల నిర్లక్ష్యం

- సకాలంలో లెటర్ అందక ఉద్యోగాన్ని కోల్పోయిన యువకుడు

పోస్టల్ అధికారితో మాట్లాడుతున్న గ్రామస్తులు

జడ్చర్ల, అక్టోబర్ 8 : పోస్టల్ అధికారుల నిర్లక్ష్యంతో ఓ యువకుడు ఉద్యోగం కోల్పోయాడు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌లోని ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో ఎస్సీ కోటా కింద ఒక్క పోస్టు ఖాళీగా ఉన్నది. దీనికి జడ్చర్ల మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన నాగరాజు 2023లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. 2024 మార్చిలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ధ్రువపత్రాలను పోస్ట్ చేశాడు. అనంతరం షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులు సెప్టెంబర్ 27వ తేదీన హైదరాబాద్‌లోని టీజీఈఆర్‌సీ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని స్పీడ్‌పోస్ట్ ద్వారా కాల్‌లెటర్‌ను పంపించారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 4వ తేదీన నాగ రాజుకు కూడా జడ్చర్ల పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు స్పీడ్‌పోస్ట్ చేశారు. అయితే, స్పీడ్‌పోస్ట్ లెటర్‌ను రెండు రోజుల వ్యవధిలో సంబంధిత వ్యక్తికి అందజేయాల్సి ఉన్నా.. పోస్టల్ అధికారులు ఈ నెల 4వ తేదీన నాగ రాజు ఇంటి పక్కన అందజేశారు. నాగరాజు అదేరోజు హైదరాబాద్‌లోని తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమిషన్ కార్యాలయానికి వెళ్లగా.. 'జోనల్ పరిధిలో ఒకే ఉద్యోగం ఉందని, అందులో నీకు జాబ్ కన్‌ఫార్మ్ అయినా రాక పోవడంతో.., గత నెల 27వ తేదీనే సర్టిఫికెట్లను పరిశీలించి వేరే వ్యక్తికి ఉద్యోగం ఇచ్చాం' అని అక్కడి అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగంపై కోటి ఆశలు పెట్టుకున్నానని, కేవలం పోస్టల్ అధికారుల నిర్లక్ష్యం వల్లే జాబ్ పోయిందని నాగరాజు వాపోయాడు. ఈ క్రమంలో మంగళవారం బాధితుడు, బంధువులు, స్నేహితులతో కలిసి జడ్చర్ల పోస్టల్ కార్యాలయానికి చేరుకొని అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవికు మార్‌ను నిలదీశారు. తమకు సెప్టెంబర్ 18వ తేదీన స్పీడ్‌పోస్ట్ వచ్చిందని, 26వ తేదీన ట్రాకింగ్‌లో ఉందని, కానీ అభ్యర్థికి అక్టోబర్ 4వ తేదీన కాల్‌లెటర్ అందజేయడం తమ పొరపాటేనని, ఇంకోసారి ఇలా జరగకుండా చూసుకుంటానని రవికుమార్ తెలిపారు.

జాతీయస్థాయికి విద్యార్థుల ఎంపిక

మక్తల్, అక్టోబర్ 8 : ఇటీవల కరీంనగర్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు సత్తాచాటి జాతీయస్థాయికి ఎంపికైనట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం తెలిపారు. మంగళవారం ఆయన మక్తల్‌లో విలేకరులతో మాట్లాడారు. సెప్టెంబర్ 18వ తేదీన కరీంనగర్‌లో జరిగిన పోటీల్లో సబ్ జూనియర్స్ బాలబాలికల విభాగంలో దివ్య (గురుకుల పాఠశాల, రాంరెడ్డిగూడెం), మహ్మద్ ఫరాహాన్ (లిటిల్ ఏంజెల్ పాఠశాల, మక్తల్) సత్తా చాటి జాతీయస్థాయికి ఎంపిక యయ్యారన్నారు. నవంబర్ 27 నుంచి 30వ తేదీ వరకు బీహార్ రాష్ట్రం బుద్గగయలో జరగనున్న జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

ప్రాజెక్టులకు నిలకడగా వరద

అయిజ, అక్టోబర్ 8 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో కృష్ణా, తుంగభద్ర నదులకు వరద నిలకడగా కొనసాగుతున్నది. టీబీ డ్యాంకు మంగళవారం ఇన్‌ఫ్లో 11,813, అవుట్‌ఫ్లో 11,654 క్యూసెక్కులుగా నమోదుకాగా.., ప్రస్తుతం 101.773 టీఎంసీల నిల్వ ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 26,330, అవుట్‌ఫ్లో 25,692 క్యూసెక్కులుగా నమోదుకాగా.., ఆయకట్టుకు 638 క్యూసెక్కులు వదిలారు. ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 18,720, అవుట్‌ఫ్లో 18,720 క్యూసెక్కులుగా నమోదుకాగా.., ప్రస్తుతం 128.19 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 16,952, అవుట్‌ఫ్లో 17,362 క్యూసెక్కులుగా ఉండగా.. ప్రస్తుతం 37.61 టీఎంసీల నిల్వ ఉన్నది.

వైద్యం డబ్బులు ఇవ్వలేదని..

- రోగి బంధువుపై వైద్య సిబ్బంది దాడి
- నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ఘటన

రోగి బంధువు చేతికైన గాయం

అచ్చంపేట రూరల్, అక్టోబర్ 8 : కడుపునొప్పితో బాధపడుతున్న మహిళను కూతురు ఓ ప్రైవేట్ దవాఖానలో వైద్యం చేయించగా.. బిల్లు విషయంలో మాటా మాటా పెరిగి.. దాడికి కారణమైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకున్నది. బల్మూరు మండలం కొండనాగుల గ్రామానికి చెందిన లింగమ్మ కడుపునొప్పితో బాధపడుతుండగా.. మూడ్రోజుల కిందట ఆమె కూతురు అచ్చంపేటలోని ఓ ప్రైవేటు దవాఖానలో చేర్పించింది. అక్కడి డాక్టర్ శివ ఆమెను పరీక్షించి నొప్పికి సంబంధించి పలు టెస్టులు చేయించాలని రోగి బంధువుకు సూచించాడు. ల్యాబ్‌లో టెస్టులు చేయించగా వైద్యం, పరీక్షలకు కలిపి మొత్తం రూ.1,500 చెల్లించాలని మంగళవారం దవాఖాన సిబ్బంది సూచించారు. దీంతో రోగి బంధువు తమ వద్ద రూ.1,000 మాత్రమే ఉన్నాయని, మిగితా రూ.500 తర్వాత చెల్లిస్తాకుని చెప్పింది. దీంతో ఓపీ రాసే కార్తీక్ ఆమెపై దాడికి దిగాడు. ఆమె చేతి చేతిని మెలికలు తిప్పడంతో చేతికున్న గాజులు కుచ్చుకొని రక్తస్రావమైంది.

ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రోగి బంధువులు కోరుతున్నారు. ఈ విషయమై ప్రైవేటు దవాఖాన డాక్టర్ శివను వివరణ కోరగా.. రోగి బంధువుకు చికిత్స చేయగా.. రూ.1,500 బిల్లు అయ్యిందన్నారు. అయితే వారు రూ.వెయ్యి మాత్రమే ఇచ్చి తగ్గించాలని సిబ్బందితో గొడవకు దిగారని చెప్పారు.

మరణంలోనూ వీడని బంధం

- అన్న మృతిని తట్టుకోలేక తనువు చాలించిన చెల్లెలు

మూసాపేట(అడ్డాకుల), అక్టోబర్ 8 : అన్న మరణాన్ని తట్టుకోలేక చెల్లెలు మృతి చెందిన ఘటన మంగళవారం అడ్డాకుల మండలం శాఖాపూర్ గ్రామంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. శాఖాపూర్‌కు చెందిన నాగన్నకు ముగ్గురు కుమారులు, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. వీరిలో పెద్దవాడైన దారం శ్రీనివాసులుయాదవ్ (54) నెల కిందట అనారోగ్యానికి గురికాగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, నాగన్న చిన్న కూతురు అరుణ (35) కొంత కాలంగా అనారోగ్యానికి గురై తల్లిగారి ఇంటి వద్దే ఉంటున్నది. అయితే, అన్న మరణం తట్టుకోలేక చెల్లెలు మంగళవారం మృతి చెందింది. అన్నా చెల్లెళ్లు ఒక్క రోజు వ్యవధిలోనే మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నమస్తే తెలంగాణ
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేయుటకు మండలాల వారీగా విలేకరులు కావలెను. స్థానిక సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన కలిగి ఉండాలి. అర్హత, ఆసక్తి, అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుంది.
మహబూబ్‌నగర్ జిల్లా : ★ మహబూబ్‌నగర్ టౌన్ ★ కోయిలకొండ ★ జడ్చర్ల టౌన్ ★ జడ్చర్ల రూరల్ ★ రాజాపూర్
నారాయణపేట జిల్లా : ★ కోస్గి టౌన్ ★ గుండుమాల్ / కొత్తపల్లి ★ సర్వ
వనపర్తి జిల్లా : ★ వనపర్తి రూరల్ ★ వనపర్తి మున్సిపాలిటీ ★ రేవల్లి ★ శ్రీరంగాపూర్
జోగులాంబ గద్వాల జిల్లా : ★ గద్వాల సిటీ సెంటర్ ★ అలంపూర్ రూరల్ ★ అలంపూర్ చౌరస్తా
నాగర్‌కర్నూల్ జిల్లా : ★ నాగర్ కర్నూల్ రూరల్ ★ నాగర్‌కర్నూల్ టౌన్ ★ తెలకపల్లి ★ కల్వకుర్తి టౌన్ ★ కొల్లాపూర్ రూరల్ ★ కొల్లాపూర్ టౌన్ ★ మన్సూరు ★ దోమలపెంట
రాత పరీక్ష తేది : 09-10-2024
సమయం : ఉదయం 11 గంటలకు
పరీక్షా కేంద్రం
వాగ్దేవి జూనియర్ కళాశాల
న్యూటౌన్, మహబూబ్‌నగర్
Cell : 9182777499, 9182777874